వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యనిర్వాహణాధికారి కె.రామంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేసి పూజలు చేశారు. – చిక్కడపల్లి, మే 26

అలరించిన కాళీమాత నృత్యోత్సవం

నృత్యోత్సవంలో రిత్విక్ వెంకట్

రవీంద్రభారతి, మే 26 : తెలంగాణ ప్రభుత్వం, భాషాసాంస్కృతిక, నృత్యదర్పణం సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ అర్ధనారీశ్వరం వెంకట్ రెండవ జయంతి సందర్భంగా వెంకట్ కుమారుడు రిత్విక్ వెంకట్ ప్రదర్శించిన కాళీమాత నృత్యోత్సవం ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ ఏకేవీఎస్ రెడ్డి, ప్రముఖ నాట్యగురువు డాక్టర్ ఎస్‌పీ భారతి హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి వెంకట్ చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం రిత్విక్‌తో పాటు నృత్య దర్పణ డ్యాన్స్ అకాడమీ శిష్యబృందంతో ప్రదర్శించిన కాళీమాతోత్సవ నృత్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో అర్ధనారీశ్వరం వెంకట్ కుమార్తె చార్మిల వెంకట్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ..



మహాత్మానగర్‌లో శ్రీ సత్యసాయిబాబా ట్రస్ట్ గాంధీనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పేదలకు ప్రతి నెలా 5 కేజీల బియ్యంతో పాటు అన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు రామన్, ఏఎస్ రాజు, మధుసూదన్, నర్సింహ, ఎంఎల్ఎన్ స్వామి, బిజ్జి కనకేశ్ కుమార్ తెలిపారు. – కవాడిగూడ, మే 26

శిథిలావస్థ భవనాల కూల్చివేతకు కసరత్తు

సుల్తాన్‌బజార్ బడిచౌడి ప్రాంతంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సర్కిల్-14 టౌన్ ప్లానింగ్ అధికారులు

- ఇప్పటివరకు గుర్తించినవి 31
- స్పందించని భవనాల యజమానులకు నోటీసులు జారీ

అబిడ్స్, మే 26 : గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రధాన ప్రాంతాలలో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ భవనాలను కూల్చి వేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సయీదుద్దీన్ నేతృత్వంలో శిథిలావస్థ భవనాలను కూల్చివేసేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన భవనాలు ఏ క్షణాన కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. భవన యజమానులు అద్దె మోజులో పడి శిథిలావస్థకు చేరుకున్న భవనాలను కూల్చివేయక పోతుండటంతో ఏ క్షణాన కూలుతాయోనని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా ప్రజలు భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది. గోషామహల్, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, సిద్ధంబర్‌బజార్, గౌలిగూడ, ఇసామియాబజార్, జాంబాగ్ ప్రాంతాలలో వంద సంవత్సరాల క్రితం నిర్మించిన పురాతన భవనాలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు ఆయా భవనాల యజమానులతో సంప్రదించి వాటిని కూల్చివేయాలని భవనాల పరిసర ప్రాంతాల్లో నివాసముండే వారు కోరుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు 2023 సంవత్సరం వరకు 25 శిథిలావస్థ భవనాలను గుర్తించారు. ఈ సంవత్సరం మరో ఆరింటిని గుర్తించగా మొత్తం 31 భవనాలలో ఎనిమిది భవనాలు ఖాళీగా ఉండగా 23 భవనాలను కూల్చి వేయాల్సి ఉంది. ఐతే అందులో 15 భవనాల న్యాయపరమైన చిక్కులు ఉండడంతో మిగిలిన ఎనిమిదింటికి గాను ఆరింటిని భవన పరీక్షల నిమిత్తం ఇంజినీరింగ్ విభాగానికి పంపించగా రెండింటిలో ఒకటి కూల్చి వేశారు. ఇంజినీరింగ్ విభాగం నుంచి నివేదిక రాగానే మిగిలిన వాటిని కూడా కూల్చి వేస్తామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ తెలిపారు.

నోటీసులు జారీ చేశాం

జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయం పరిధిలో మొత్తం 31 ఉండగా అందులో 15 భవనాలకు న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. మిగిలిన పదహారులో ఎనిమిది భవనాలు ఖాళీగా ఉన్నాయి. ఆరు భవనాలను ఇంజినీరింగ్ విభాగం అధికారుల నివేదిక కోసం పంపాం ఒక భవనాన్ని కూల్చి వేయగా మిగిలిన వాటి నివేదిక ఆధారంగా వాటిని కూడా కూల్చివేస్తాం.

– సయ్యద్ సయీదుద్దీన్, ఏసీపీ టౌన్ ప్లానింగ్

రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి

రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించిన కళా జనార్దన మూర్తి

ముషీరాబాద్, మే 26: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్రపోషించిన రావి నారాయణరెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలిచిన గొప్ప సాయుధ పోరాట యోధుడని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థను అంతమొందించడానికి అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని ఆమని, నైషధం సత్యనారాయణమూర్తి, తోట శ్రీలక్ష్మి, తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

- డయాబెటీస్ ఎక్స్‌పో-2024 ప్రారంభోత్సవంలో మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

డయాబెటీస్ ఎక్స్‌పో -2024 ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ చీఫ్ జస్టీస్ ఎన్వీ రమణ తదితరులు

కొండాపూర్, మే 26: మధుమేహంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి దరిచేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వచ్చాక పాటించాల్సిన నియమాలపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ఆదివారం డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాబెటీస్ ఎక్స్‌పో-2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధుమేహం వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తుందని, దేశంతోపాటు హైదరాబాద్ నగరంలో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. యువత, చిన్న పిల్లలు సైతం మధుమేహం వ్యాధికి గురవుతున్నారని, మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ డాక్టర్ కే సతీశ్‌రెడ్డి, ప్రొఫెసర్ బీకే సహాయ్, డాక్టర్ వీ మోహన్, డాక్టర్ ఆర్ఎం అంజన తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నిత్య హోమంలో పాల్గొన్న ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ సింగ్, ఆలయ ఈఓ బి. కృష్ణ

అబిడ్స్, మే 26 : గుడిమల్కాపూర్‌లోని శ్రీ ఝాంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నిత్య హోమం, శ్రీవారి శేష వాహన సేవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ సింగ్, ఆలయ ఈఓ బి. కృష్ణల నేతృత్వంలో ప్రధాన అర్చకులు అంబారిపేట శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సి. శ్యాంరావు, చంద్రకళ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

రేపు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, రాత్రికి రథోత్సవం..

శ్రీ ఝాంసింగ్ బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ బి. కృష్ణ తెలిపారు. అదే రోజు రాత్రి శ్రీవారి దివ్య బ్రహ్మ రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌కు స్పందన



పరీక్షకు హాజరైన సివిల్స్ అభ్యర్థులు

చిక్కడపల్లి, మే 26 : విజన్ ఐఏఎస్ ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థుల కోసం నిర్వహించిన ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌కు స్పందన వచ్చిందని ఆ సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ హెడ్ హరే కృష్ణసింగ్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించిన ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌కు వెయ్యి మందికంటే ఎక్కువ వచ్చారని తెలిపారు. అభ్యర్థులకు ఈ టెస్ట్ ఎంతో దోహద పడుతుందని ఆయన అన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

చిక్కడపల్లి, మే 26 : సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేషన్, 9 స్టార్ హెల్త్ కేర్, జీజీ చారిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరాన్ని పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేసన్ చైర్మన్ సుచరితారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్. వివేక్, ప్రధాన కార్యదర్శి పి. వెంకట్‌స్వామిగౌడ్, రమేశ్‌గుప్తా, నవీన్, శివ, శంకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ కుమారుడు అఫ్సర్‌మొహినుద్దీన్ వాహ రిసెప్షన్ గుడిమల్కాపూర్ కింగ్ క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ విప్, ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు, ఏసీ బీ డీజీ సీవీ ఆనంద్, ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు పాల్గొని కౌసర్‌మొహినుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

– మెహిదీపట్నం, మే 26

ఘనంగా విశ్వకర్మ లెజెండరీ అవార్డుల ప్రదానోత్సవం

శ్రీనివాస్‌ను పురస్కారంతో సన్మానిస్తున్న తల్లోజు ఆచారి తదితరులు

చిక్కడపల్లి, మే 26 : విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్ర బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెంటర్ అధ్యక్షుడు విశ్వనాథుల పుష్పగిరి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశ్వకర్మ ప్రముఖులకు విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగద్గురు శ్రీ కాతేంద్రస్వామి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దొంచనాల శ్రీనివాస్‌కు జీవత సాఫల్య పురస్కారం అందజేశారు. ఈ సమావేశంలో చర్లపల్లి జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ దర్లా కాళిదాసు, తెలంగాణ సాహితి అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ఐఎన్‌పీఆర్ పబ్లిసిటీ సెల్ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ డాక్టర్ బి. నీలిమాకృష్ణమూర్తి, దిలీప్‌చారి, దరువు అంజన్న, తాటి కొండ రంగబాబు, జీతేంద్ర చారి, గణేశ్ బాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

లంగర్‌హౌస్ రింగ్‌రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామాంజనేయులు

మెహిదీప ట్నం, మే 26 : ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. ఆదివారం వారు వాహనాల తనిఖీలను చేపట్టారు. లంగర్ హౌస్ రింగ్ రోడ్, సంగం రామమందిరం, రేతిబౌలిలో ఇన్‌స్పెక్టర్ అంజయ్య సూచనలతో ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. భారీ వాహనాలను నిర్ణీత సమయంలోనే నగరంలోకి అనుమతించాల్సి ఉండగా, ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నారని అలాంటి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. మైనర్ల డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లే వారిపై కేసు లు నమోదు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధలను ప్రతి ఒక్కరూ పాటించేలా పనిచేస్తున్నామని లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య పేర్కొన్నారు.

గుంటూరు రైల్లో దొంగతనం..

కాచిగూడ, మే 26: గుంటూరు రైల్లో ప్రయాణికుని బంగారు ఆభరణాలు, నగదు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. కొత్తగూడం, అశ్వాపురం ప్రాంతానికి చెందిన ఉపేందర్(45) హమాలి. మణుగూరుకు వెళ్లడానికి శనివారం రాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-1లో భార్యాభర్తలు కలిసి గుంటూరు రైలెక్కారు. సీట్లో బ్యాగు, లగేజీ పెట్టి కుటుంబ సభ్యులకు వీడ్కోలు చెప్పడానికి డోర్ దగ్గరకు వచ్చి, తిరిగి సీటు దగ్గరకు వెళ్లి చూసేసరికి బ్యాగు మాయమైంది. అందులో 6 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 వేలు, ఖరీదైన బట్టలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుని పారిపోయారు. బాధితుడు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 26 : వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)శివరాంనల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2 చివర్లో కొన్ని రోఉలుగా అనారోగ్యంగా ఉంటూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై వంకాయ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు పేర్కొన్నారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నుల పండువగా బసవేశ్వరుడి జయంతి

జియాగూడలో బసవేశ్వరుడి జయంతి సందర్భంగా ఊరేగింపు నిర్వహిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

సుల్తాన్‌బజార్, మే 26 : జియాగూడలో బసవేశ్వరుడి జయంతి వేడుకల సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకొని బసవ జయంతి ఉత్సవ సమితి భాగ్యనగర్ హైదరాబాద్, ఎల్‌డీఎంఎస్, కేజీఏఎన్ఎం, వైఆర్‌బీడీల ఆధ్వర్యంలో జియాగూడ బసవ మండప్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వరకు భారీ శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుల్సుంపురా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రామ్‌దాస్‌లు ప్రత్యేక పూజలను నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం భారీ ఊరేగింపు జియాగూడ మండప్ నుంచి ప్రారంభమై పురానాపూల్, బేగం బజార్, ఎంజే మార్కెట్ మీదుగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానానికి చేరుకుంది. ఈ ఊరేగింపులో బసవేశ్వరుడి విగ్రహం, గంగామాతా జీ, అక్కమ్మ దేవి, ఇతర మహాపురుషుల వేశధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు భజన కీర్తనలు, మేళతాళాలతో ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బసవదళ్ అధ్యక్షుడు శంకరప్ప పాటిల్, ఉపాధ్యక్షుడు కుంటబీర్ జగనాథప్ప, ప్రధాన కార్యదర్శి అనిల్ పాటిల్, యూత్ ఆర్‌బీడీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ కాల్సే, ప్రభాకర్ సతాడే, విజయ్ కుమార్ పట్నే, భాగ్యవన్ జవలే, కె. మారుతి, శివాజీ, జయరాజ్, జగనాథజవాలే పాల్గొన్నారు.

బసవేశ్వరుడి జయంతికి ముఖ్యఅతిథిగా వచ్చిన కుల్సుంపురా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రామ్‌దాస్‌లను సన్మానిస్తున్న బసవ జయంతి ఉత్సవ సమితి ప్రతినిధులు

ఇందిరానగర్‌లో గుంతల పూడ్చివేత

మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. ఇందిరానగర్ ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ మంగళ్‌హాట్ ఇన్‌చార్జి జి. శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. వై. లింగారెడ్డి సహకారంతో పనులు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

– అబిడ్స్, మే 26

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మే 26: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు..

ఆర్ఓఎం ఫీడర్ పరిధిలోని ఆర్‌టీసీ కల్యాణ మండపం, హిమాయత్‌నగర్ తాసీల్దార్ కార్యాలయం, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, రాజేంద్ర ఆయిల్‌మిల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు..

ఆజామాబాద్, శాస్త్రీనగర్ ఫీడర్‌ల పరిధిలోని రాంనగర్, శ్రీనివాస టెక్స్‌టైల్స్, ఘరోండ అపార్టుమెంట్, ఆజామాబాద్, మహాన్‌నగర్, శాస్త్రీనగర్, జెమిని కాలనీ, సెయింట్ పాయిస్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

పార్సిగుట్ట ఫీడర్ పరిధిలోని ప్రేయర్ పవర్ చర్చి, రాంనగర్, బాప్టిస్టు చర్చి, బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, శ్మశాన వాటిక పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు..

44 నంబరు బస్ స్టాఫ్ ఫీడర్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, 44 నంబర్ బస్ స్టాఫ్, గంగపుత్రకాలనీ, చేపల మార్కెట్, రామాలయం, అంజయ్య నాలా పరిసర పాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మెహిదీపట్నం పరిధిలో..

మెహిదీపట్నం : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 మధ్యాహ్నం 12.30 గంటల వరకు..

బాలాజీనగర్, సత్యనారాయణనగర్, క్రిస్టల్‌గార్డెన్, గుడిమల్కాపూర్, హీరానగర్, సాయినగర్, పవన్ గార్డెన్, కేఆర్ కేఎం గార్డెన్, శివబాగ్, మహేశ్‌నగర్, రూఫ్‌గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 12. 30 నుంచి 2 గంటల వరకు..

శివబాగ్, జయనగర్, శారదానగర్, గుడిమల్కాపూర్, కబడ్డీ స్టేడియం, మహావీర్‌నగర్, మార్కండేయనగర్, ఎల్ ఐసీ ప్రాంతాలు..

2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

సప్తగిరి కాలనీ, ఖాదర్‌బాగ్, రాక్‌హిల్స్ కాలనీ, బహదూర్ యార్ జంగ్ కాలనీ, సర్దార్‌బాగ్, జ్యోతినగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

3 .30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

పద్మనాభనగర్, కరోల్‌బాగ్, లక్ష్మీనగర్, సప్తగిరి కాలనీ, నానల్‌నగర్ క్రాస్ రోడ్, రాఘవ స్కూల్, పీఅండ్‌టీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

11.0 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..

హకీంపేట్, అల్‌హస్నత్ కాలనీ, యూసుఫ్ ట్యేడ్కి, మిరాజ్ కాలనీ, మిలటరీ ఏరియా, మందార్ రెస్టారెంట్, అల్ హస్నత్ కాలనీ, యూసుఫ్ ట్యేడ్కి, నిజాంకాలనీ, టోలిచౌకి, డీలక్స్ కాలనీ, దౌలత్‌గుల్షన్ కాలనీ, బడాజానకీనగర్, కేఎఫ్‌సీ ప్రాంతాలు..

మధ్యాహ్నం 12.10 నుంచి 12.50 గంటల వరకు..

కాకతీయనగర్, సాలార్జంగ్ కాలనీ, మొఘల్‌హైట్స్, అల్ కరీం కాలనీ, విరాసత్‌నగర్ కాలనీ, ఓవైసీ పార్కు తదితర ప్రాంతాలలో విద్యుత్ నిలిపి వేస్తారు.